క్లుప్తంగా

పార్వతీ సమేత సోమేశ్వర స్వామికి అభిషేకాలు

ఉండ్రాజవరం: తాడిపర్రులో నూతనంగా ప్రతిష్ఠించిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు మంచిలి సాయిరామ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ఆకుల నాగసాయి అఖిల్ (3151)

తాళ్లపూడి: ఏపీ ఈఏపీ సెట్ పరీక్షా ఫలితాల్లో తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌కే జీఆర్ అండ్ ఎస్‌ఎస్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని యాజమాన్యం తెలిపింది. ఆకుల నాగసాయి అఖిల్ 3151 ర్యాంకు, జున్నూరు అంజనా, జి స్వరూప, శ్రీహరి ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కరిబండి గనిరాజు, డైరెక్టర్ త్రినాథస్వామి, సెక్రటరీ సర్వారాయుడు, ప్రిన్సిపాల్ పి.మురళి ర్యాంకర్లకు అభినందనలు తెలిపారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలి



తాళ్లపూడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీ వాసులు

తాళ్లపూడి: అన్నదేవరపేట వద్ద గల జగనన్న కాలనీలో వసతులు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా ప్రతి నెలా రేషన్ సరుకులు తమ కాలనీలోనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అక్కడ నివాసముంటున్న వారు తాళ్లపూడి తహసీల్దార్ మోహన భారతికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ డ్రెయినేజీ, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కావాలని, రోడ్లు వేయాలని అధికారులను కోరారు.

ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

తాళ్లపూడి: ఇసుక తవ్వకాల సమయంలో నిబంధనలు పాటించాలని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. మండలంలోని ప్రక్కిలంక లంక భూముల్లోని బ్లాక్ 3 (గోదావరి ఎడమ ఒడ్డు) ఇసుక తవ్వకానికి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. సర్వే నంబర్లు 114/1, 139/1, 39/2, 3, 40/1,2లో పట్టా భూముల్లో 13 హెక్టార్లల్లో ఇసుక మేటల తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో పలువురు గ్రామస్తులు, ఎన్‌జీవోలు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ర్యాంపులో పర్యావరణ అనుమతులకు లోబడి ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, మైనింగ్ శాఖ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, తహసీల్దార్ మోహనభారతి, ఆర్ఐ కె రామకృష్ణ పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

పెరవలి: టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో 100 రోజుల కార్యక్రమం చేపట్టినట్టు కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.హేమరాజు తెలిపారు. పెరవలి మండలం కానూరులో సోమవారం ఆయన వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి ప్రసంగించారు. క్షయ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావన మధు, ఎంపీహెచ్ఓ కె నాగేశ్వరరావు, రాణి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం

నిడదవోలు : ప్రతిరోజు యోగా సాధనతో ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా సోమవారం పట్టణంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గణపతి సెంటర్ నుంచి గణేష్ చౌక్ వరకు వరకు మునిసిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాస్ ర్యాలీ నిర్వహించారు. గణేష్ చౌక్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రజలకు యోగ ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో యోగ గురువులు ఎస్.సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, మునిసిపల్ సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

దేవరపల్లి: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని, దీనిపట్ల ప్రజల్లో చైతన్య తీసుకురావడానికి ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం ద్వారా కృషి చేస్తుందని ఎంపీడీఓ ఎస్. వేణుగోపాలరెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక బస్టాండ్ వద్ద ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు.

దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



నిడదవోలులో సీఐ పీవీజీ తిలక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



ఎస్సై రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న తాళ్లపూడి మండల సాక్షి విలేకరి సత్యనారాయణ

నిడదవోలు: సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిడదవోలు సీఐ పీవీజీ తిలక్‌కు విలేకరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సాక్షి నిడదవోలు ఆర్‌సీ ఇన్‌చార్జి గాడి శేఖర్‌బాబు మాట్లాడుతూ అమరావతి రాజధాని అంశంపై సాక్షి టీవీలో ప్రసారమైన చర్చకు సంబంధించి సాక్షి గ్రూపునకు ఎలాంటి ప్రమేయం లేనప్పటికీ తెలుగుదేశం పార్టీ అధిష్టానం కుట్రపూరితంగా పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి సాక్షి కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు విలేకరులు ముప్పిడి రవితేజ, కేవీవీ సత్యనారాయణ, సయ్యద్ ఇబ్రహీం పాల్గొన్నారు.

ఎస్సైకు వినతిపత్రం అందజేత

తాళ్లపూడి: సాక్షి మీడియా సంస్థలు సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ ఛానల్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పాత్రికేయులు అన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులను అరికట్టాలని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై టి.రామకృష్ణకు సోమవారం తాళ్లపూడి మండల సాక్షి విలేకరి ఎం సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. అమరావతి రాజధాని అంశంపై సాక్షి టీవీలో ప్రసారమైన చర్చకు సంబంధించి కొందరు వ్యక్తులు చేపట్టిన నిరసనలు, రాళ్ల దాడులు, బెదిరింపులు, ఇతర నేర చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్ అరెస్టును ఖండించడంతో పాటు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయులు కోరారు.

తలారి పరామర్శ



కలవలపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: మండలంలోని నాలుగు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కలవలపల్లి శివారు రామచంద్రపురంలో మెరిపో రవికుమార్, కుంకుడిమిల్లిలో కస్సే సోమయ్య, మార్కొండపాడులో ఎం.నాగేంద్రవరప్రసాద్, కలవలపల్లిలో మట్టా దాస్ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను తలారి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ ఆర్టీఏ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, పార్టీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు ప్రత్తిపాటి రామచంద్రరావు, గూడపాటి శివ, తాళ్లూరి దామోదారం, ఉన్నమట్ల బ్రాహ్మనందం, యర్లగడ్డ జోషి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- రోజుకు 500 ట్రాక్టర్లు తరలిపోతున్న మట్టి
- పట్టించుకోని అధికారులు
- అధికార పార్టీ మండల నేత కనుసన్నల్లో తవ్వకాలు



అన్నవరప్పాడు సెంటర్‌లో మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్



పెరవలి -కాపవరం పరిధిలో మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై వేస్తున్న పొక్లెయినర్లు



పెరవలి-కాపవరం వద్ద గోతులుపడిన నరసాపురం కాలువ గట్టు

పెరవలి : అధికార పార్టీ నేతలే దళారీలకు అండగా ఉండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నారు. ఈ మట్టి వ్యాపారం మూడు ట్రాక్టర్లు ఆరు లారీలుగా కొనసాగుతున్నదంటే అడిగే వారు లేకపోవడమే కారణమని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా జరుపుతున్నారు.

కాలువగట్లను కొల్లగొట్టి మట్టి తరలింపు

అధికారుల కళ్లెదుటే వందలాది ట్రాక్టర్లు తరలివెళ్తున్నా కన్నెత్తి చూడకపోవడంతో యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పంట భూములను, కాలువ గట్లను తవ్వేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పంట పొలంలో మట్టిని తవ్వాలన్నా మెరక చేయాలన్నా మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. ఎటువంటి అనుమతులు లేకుండా దళారీలు రైతులకు సొమ్ము ఆశచూపి మట్టిని తరలించుకుపోతున్నారు. ఒక ట్రాక్టర్ మట్టికి రైతుకు రూ.150 ఇచ్చి బయట ట్రాక్టర్ మట్టిని రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. పంట చేలో మట్టిని తవ్వాలంటే మైనింగ్ శాఖ అనుమతి తీసుకుని నిబంధనల ప్రకారం అడుగున్నర మాత్రమే అదికూడా మనుషులతో తవ్వవలసి ఉంది. రెండున్నర అడుగుల వరకు మట్టిని ప్రొక్లెయినర్‌తో తవ్వేస్తున్నారు. చేలో మట్టి తవ్వుతున్నామంటూ అక్రమార్కులు పక్కనే ఉన్న కాలువగట్లను కొల్లగొడుతున్నారు. పెరవలి మండలంలో పిట్టల వేమవరం, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, తీపర్రు, పెరవలి, కాపవరం గ్రామాల్లో ప్రతి రోజు వందలాది ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరురయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా, అధికారుల కళ్లముందు వందలాది ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నా చోద్యం చూస్తున్నారని పలువురు ధ్వజమెత్తుతున్నారు.

రెవెన్యూ శాఖ ఉదాసీన వైఖరి

అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదంటే పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందుతున్న మామూళ్లే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే తవ్వకాలు కొనసాగే వైపునకు ఏ ఒక్క అధికారి కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖ ఈ అక్రమ తవ్వకాల పట్ల ఎందుకు ఉదాసీన వైఖరి అవలంబిస్తోందో వారికే ఎరుక. లేఅవుట్లు పూడ్చడానికి ఈ మట్టిని తరలిస్తున్నారు.

రహదారులు ఛిద్రం

రాత్రికి రాత్రే పంట భూములు రియల్ ఎస్టేట్ లేఅవుట్లుగా మారిపోతున్నాయంటే ఇక్కడ మట్టి ట్రాక్టర్లు ఎన్ని తిరుగుతున్నాయో అర్థమవుతుంది. వేగంగా మట్టి ట్రాక్టర్లు గ్రామం నుంచి వెళ్తున్నప్పుడు ప్రజలు భయపడుతున్నారు. ఒకటి తరువాత ఒకటి వెళ్లడంతో రోడ్లు పాడైపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో కాకరపర్రు, పిట్టలవేమవరం, పెరవలి, కాపవరం, కొత్తపల్లి, నల్లాకులవారిపాలెంలోని పంట భూముల నుంచి ప్రతి రోజూ 500 ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే కొద్దికాలానికే పంట భూములు చెరువులుగా, కొన్ని భూములు రియల్ ఎస్టేట్ లేఅవుట్‌గా మారిపోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దళారులు ఇంత దర్జాగా మట్టి తవ్వి తరలించేందుకు అధికార పార్టీకి చెందిన మండల నేత అండ పుష్కలంగా ఉందనే ప్రచారం ఉంది.

కాలువగట్టుకు తూట్లు

నిడదవోలు-నరసాపురం కాలువ గట్టుపై కాపవరం నుంచి పెరవలి మీదుగా వందలాది ట్రాక్టర్లు రాకపోకలు సాగించడంతో కాలువగట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ గోతులు పడిపోవడంతో వర్షాకాలంలో గట్టు బలహీనపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయకపోతే కాలువగట్టుకు గండ్లు పడే అవకాశం ఉందని రైతులు అన్నారు.

నిబంధనలు ఇలా..

పంట భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి.అనుమతులు పొందిన తరువాత కేవలం అడుగున్నర లోతు మాత్రమే మట్టి తీయాలి.మట్టిని కేవలం మెరక చేలల్లో మాత్రమే తీయాలి. పల్లపు చేల నుంచి మట్టిని తీయకూడదు.ఈ మట్టిని కేవలం మనుషులతో మాత్రమే తవ్వించాలి. యంత్రాలతో తీయకూడదు.

తహసీల్దార్ డి.అచ్యుతకుమారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదే సమయంలో ఇరిగేషన్ ఏఈకి తెలియజేస్తే కాలువగట్లపై భారీ వాహనాలతో రాకపోకలు సాగించకూడదని, వెంటనే మట్టి తరలింపును నిలుపుదల చేస్తామని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు



దేవరపల్లిలో విశ్రాంత ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ దేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండల విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాజమహేంద్రవరం అకీరా ఆసుపత్రి వైద్యులు 50 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల శాఖల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు, ఆరోగ్య బీమా కార్డు ఉన్న ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారని, అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు, ప్రధాన కార్యదర్శి ఈదుపుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి గద్దే కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య అకిరా ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు

నిడదవోలు : నిడదవోలులోని ఒకటో వార్డు బాలాజీ నగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న మున్సిపల్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నిడదవోలు పట్టణానికి చెందిన సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై డీఆర్వోకు వినతి పత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. నిడదవోలు మున్సిపాలిటీలో 1వ వార్డు బాలాజీ నగర్లో సర్వే నంబర్ 40లో 68 సెంట్లు భూమి బియ్యపు గుంట (బండి దారి)ని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఆదేశాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వాధీనం చేసుకొని అక్కడ ఉన్న పాడి పశువులకు ఉపయోగపడే చెరువును మున్సిపల్ పైప్‌లైన్లు షెడ్లను ధ్వంసం చేసి పూడ్చివేశారని రాంబాబు ఆరోపించారు. ఆక్రమణదారులపై, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు క్లియరెన్స్ ఇచ్చిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని రాంబాబు కోరారు. సర్వే చేసి మున్సిపల్ స్థలంలో ఆక్రమణదారులు తొలగించిన మున్సిపల్ సరిహద్దులను యథావిధిగా ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులు



మండల విద్యాశాఖ అధికారి తిరుమలదాస్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తదితరులు

దేవరపల్లి: ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో భాగంగా దేవరపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావును వారంతా కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుమలదాస్ మాట్లాడుతూ 10 మంది ప్రధానోపాధ్యాయులు కొత్తగా బదిలీపై వచ్చి వివిధ పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. పాఠశాలల్లో రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా ఈ మార్పు జరిగినట్టు ఆయన తెలిపారు. 43 మంది ఉన్నత పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులుగా బదిలీ వచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాల్సి ఉందని, సుమారు 60 మంది కొత్తగా వివిధ పాఠశాలల్లో చేరవచ్చునని ఆయన తెలిపారు.

కోకో కొనుగోలుకు చర్యలు



కోరుమామిడిలో కోకో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

నిడదవోలు రూరల్: జిల్లాలో కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజా కొనుగోలు చేసేందుకు రెవెన్యూ, ఉద్యానవన శాఖల అధికారులతో ఒక బృందం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. నిడదవోలు మండలంలోని కోరుమామిడి, కొవ్వూరు మండలం మద్దూరులో కోకో రైతులతో సోమవారం కలెక్టర్ ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న కోకో పంటను సర్వే చేసి వాస్తవ సాగుదారుల నుంచి కోకోను కొనుగోలు చేస్తామని చెప్పారు. కిలో రూ.500 చొప్పున రైతులకు ధర చెల్లిస్తే, ప్రభుత్వం రూ.50 చొప్పున కంపెనీలకు రాయితీ అందిస్తుందన్నారు. జిల్లాలో ఈనెలఖరులోపు కోకో గింజల సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి బి.సుజాత కుమారి, కోకో రైతులు పాల్గొన్నారు.

సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలి



కమిషనర్ టి.కృష్ణవేణికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు

నిడదవోలు : పట్టణంలోని బాలాజీనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న బియ్యపుగుంట చెరువు సర్వే నంబర్ 40లో 68 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని వెంటనే సర్వే చేయించి, సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు కలసి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలోని రైతులు గతంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మున్సిపల్ అధికారులు వేసిన సరిహద్దు స్తంభాలను ఆక్రమణదారులు తీసివేసారని తెలిపారు.ఆక్రమదారులు చెరువును పూడ్చి వేయడంతో రైతులు అవస్థలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఇక్కడే ఉన్న పంపింగ్ హౌస్ భవనాన్ని కూల్చివేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న చెరువును పూర్తిగా సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆకుల ముకుందరావు, దాకే అనిల్‌కుమార్, నాయకులు తోలేటి కోటేశ్వరరావు, అలమూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం



కలెక్టర్ పి. ప్రశాంతి చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకుంటున్న కొటాని నీయాతి స్వరాలి



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

దేవరపల్లి: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డులను రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతి చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నట్టు మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్ తెలిపారు. యర్నగూడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులు కోటాని నీయాతి స్వరాలి, దొడ్డిగర్ల భవ్యశ్రీ అవార్డులను అందుకున్నారు. రూ. 20 వేలు నగదు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. విద్యార్థులు కడలి రామ్‌చరణ్ సత్య, జరపాల ఇందుమతి, అయినాల మాధుర్య, సొలస ప్రజ్వల్ అవార్డులు అందుకున్నట్టు ఆయన తెలిపారు. యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని అక్కాబత్తుల అమీ కారుణ్య కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ప్రతిభావంతులకు అభినందనలు

తాళ్లపూడి: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులను తాళ్లపూడిలోని మాంటిస్సోరీ ఇంగ్లీష్ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపిక కాగా వారు సోమవారం రాజమండ్రి శ్రీ త్యాగరాజ నారాయణ సేవా సమితి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పిప్రశాంతి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. విద్యార్థులు శిరిగినీడి సత్యదేవ్, చెరుకు సుమాంజలి, బండారు మేఘన, కూన రేణుక, మేకా లక్ష్మి భవ్యకు ప్రతిభాపురస్కారం, రూ. 20 వేలు, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం 33/11 కేవీ రామన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రెండు గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.

రేపు పలు గ్రామాల్లో..

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 11 తేదీ బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరిశ్రమలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాడిమళ్ల, కోరుమామిడి పరిధిలోని వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.